సాక్షి
వికారాబాద్

సోమవారం । 16 । సెప్టెంబర్ । 2024



ప్రయోజనం శూన్యం

పెద్దేముల్ మండల కేంద్రంలో జెడ్పీ నిధులతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా మారింది.

8లో▸



దుద్యాల్ అభివృద్ధికి చర్యలు

దుద్యాల్‌కు ప్రభుత్వ ఆస్పత్రి, జూనియర్, ఐటీఐ కళాశాలలు మంజూరైనట్లు కడా అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు.

8లో▸



సమస్యలపై పోరాటం

పేదల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ పోరాటం చేస్తుందని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి తెలిపారు.

9లో▸



కోట్‌పల్లి ప్రాజెక్టు నీటిలో సందడి చేస్తున్న పర్యాటకులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ధారూరు మండలం కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఆదివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. ప్రాజెక్టు అలుగుపై, నీటిలో ఆడుకుంటూ ఎంజాయ్ చేశారు. గంటల తరబడి సేద తీరారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. యువకులు, కుటుంబ సభ్యులు సరదాగా బోటింగ్ చేశారు.

– ధారూరు



ఉత్సాహంగా బోటింగ్ చేస్తున్న జనం

న్యూస్‌రీల్

ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్లు చేయండి

కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. ఆదివారం కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా అన్ని శాఖల అధికారులతో మాట్లాడారు. ఈ నెల 17న కలెక్టరేట్ ఆవరణలో వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేదిక, అతిథులు కూర్చునేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీల్లో కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. అతిథులకు ఆహ్వానాలు పంపాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి వేడుకలను విజయవంతం చేయాలని తెలిపారు. టెలీకాన్ఫరెన్స్‌లో తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీఓ వాసుచంద్ర, మండల స్పెషల్ ఆఫీసర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

పరిగి: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో పరిగి శాఖ 3వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సభల ద్వారా ప్రజా సమస్యలపై చర్చించి పథకాల అమలును పరిశీలిస్తామన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించినట్లు తెలిపారు. రుణమాఫీ అమలు కాని రైతులు చాలా మంది ఉన్నారని వారందరికీ న్యాయం చేయాలని కోరారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, బాధిత రైతులకు ఎకరాకు రూ.20 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలు అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ప్రజల పక్షాన ఉండి పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు చంద్రయ్య, నాయకులు హబీబ్, రాజేందర్, మాంజిల్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పంట దిగుబడిపై వర్షాల ప్రభావం

జాతీయ గణాంకాల అధికారి జితేందర్ కుమార్



పంట దిగుబడిని తూకం వేస్తున్న అధికారులు

దోమ: జిల్లాలో భారీ వర్షాల కారణంగా పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడిందని జాతీయ గణాంకాల అధికారి జితేందర్ కుమార్ తెలిపారు. ఆదివారం దోమ మండలం బుద్లాపూర్‌కు చెందిన రైతు రాందాస్ పొలంలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. జొన్నపంట దిగుబడిని అంచనా వేశారు. ఐదు మీటర్ల వెడల్పు, ఐదు మీటర్ల పొడవుతో కోతలు చేసి దిగుబడిని అంచనా వేశారు. ఎకరాకు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, కేవలం 50 కిలోలు మాత్రమే వచ్చిందని తెలిపారు. భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయని, దిగుబడి రాలేదని తెలిపారు. ప్రతి రైతూ వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించి పంటలను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గణాంకాల మండల ఇన్‌చార్జ్ అధికారి సందీప్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అన్నదాత పోరుబాట

ఫార్మా కంపెనీ ఏర్పాటుకు నిరసనగా రైతుల ఆందోళన

- భూములిచ్చేది లేదంటున్న కర్షకులు
- కొనసాగుతున్న ధర్నాలు, నిరాహార దీక్షలు
- ప్రభుత్వం పునరాలోచన చేయాలని విన్నపం

దుద్యాల్: పర్యావరణానికి, మానవ మనుగడకు నష్టం కలిగించే ఫార్మా కంపెనీలు మా ప్రాంతంలో వద్దు.. పరిశ్రమల ఏర్పాటుకు మా భూములు ఇచ్చేది లేదని బాధిత రైతులు ధర్నాలు, నిరాహార దీక్షలతో నిరసన తెలుపుతున్నారు. దుద్యాల్ మండలం లగచెర్ల, హకీంపేట, పోలేపల్లి, పులిచెర్ల తండా, రోటిబండ తండాల పరిధిలో దాదాపు 1,274 ఎకరాల భూమిని ఫార్మా కంపెనీ కోసం సేకరించాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ సమాచారం అందుకున్న రైతులు మూడు రోజుల క్రితం పోరుబాట పట్టారు. తరతరాల నుంచి వారసత్వంగా భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని.. ఫార్మా కంపెనీ పేరుతో భూములు లాక్కోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలతో నిరసన తెలుపుతున్నారు. పరిశ్రమ అనుమతులు రద్దు చేసే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ బలవంతంగా



ఫార్మా కంపెనీ ఏర్పాటుకు నిరసనగా ఆందోళన చేస్తున్న బాధితులు

భూములు లాక్కుంటే ప్రాణాలకు తెగించి పోరాడతామని హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వం దిగివచ్చేనా?

గతంలో ఫార్మా కంపెనీ కోసం అవసరమైన భూములను సర్వే చేయడానికి వస్తే రైతులు అడ్డుకున్నారు. మాకు సమాచారం ఇవ్వకుండా సర్వే ఎలా చేస్తారని నిలదీశారు. దీంతో అధికారులు వెనక్కు వెళ్లక తప్పలేదు. ఇదిలా ఉండగా భూ సేకరణ నోటిఫికేషన్ వచ్చేలోపే ప్రభుత్వానికి తమ నిరసన తెలపాలని బాధిత రైతులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా నిరాహార దీక్షలు చేస్తున్నారు. నాలుగు రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. 20 రోజుల క్రితం ఓ మహిళ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఆందోళనలు ఉధృతమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం దిగివస్తుందా? లేకుంటే ముందుకు సాగుతుందా? అనేది చూడాల్సి ఉంది.

పచ్చని పొలాలకు నిలయం

దుద్యాల్ మండలం పచ్చని పొలాలకు నిలయం.. ఇలాంటి ప్రాంతంలో ఫార్మా కంపెనీ ఏర్పాటు చేస్తే పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని రైతులు



పరిశ్రమ ఏర్పాటుకు సిద్ధం చేసిన నక్ష

అంటున్నారు. కంపెనీ నుంచి వెలువడే కాలుష్యం, వ్యర్థాలు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు కూడా పండవని పేర్కొన్నారు. స్వచ్ఛమైన వాతావరణాన్ని కలుషితం చేయరాదని వేడుకుంటున్నారు.

ఆత్మహత్యలే దిక్కు

ఫార్మా కంపెనీ కోసం సాగు భూములను బలవంతంగా లాక్కుంటే మాకు ఆత్మహత్యలే దిక్కని ఆయా గ్రామాల రైతులు అంటున్నారు. సాగు భూములు మికిచ్చి మేం ఏమి చేయాలని ప్రశ్నిస్తున్నారు. మా భూములు లాక్కొని మా బతుకులు ఆగం చేయవద్దని విన్నవిస్తున్నారు.

భూములు ఇచ్చే ప్రసక్తే లేదు



కొన్ని తరాల నుంచి వారసత్వంగా భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. పంటలతోనే మా జీవితం ముడిపడి ఉంది. ఫార్మా కంపెనీ కోసం భూములు తీసుకుంటే వీధిన పడతాం. భూములు ఇచ్చే ప్రసక్తే లేదు. ప్రాణాలు ఉన్నంత వరకు పోరాడుతాం. మా భూముల జోలికి రావొద్దు. పరిశ్రమ ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి.

– బోగమోని సురేశ్, బాధిత రైతు, లగచెర్ల

ఫార్మాను రద్దు చేయాల్సిందే



దుద్యాల్ మండలం పచ్చని పొలాలు, పాడి పరిశ్రమకు మారుపేరు. ఇక్కడి ప్రజలు వ్యవసాయం, కూలి పనులు చేసుకుంటూ చాలా ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నారు. ఫార్మా కంపెనీల ఏర్పాటు చేసి మా జీవితాలను ఆగం చేయకండి. మా భూముల జోలికి వస్తే ఎంతకైనా సిద్ధమే. ప్రభుత్వం దిగి వచ్చేదాకా పోరాటం చేస్తాం.

– రాకం యాదయ్య, బాధిత రైతు, హకీంపేట

ఫ్రూట్ మార్కెట్‌పై నజర్

- పాలక మండలి ఏర్పాటుకు ప్రభుత్వం పచ్చజెండా
- గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మధుసూదన్‌రెడ్డి?

ఇబ్రహీంపట్నం రూరల్: ఆసియా ఖండంలోనే అతి పెద్ద పండ్ల మార్కెట్‌గా పేరుగాంచిన గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ పాలకవర్గ ఏర్పాటుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. గతంలో కొత్తపేటలో కొనసాగిన ఈ ఫ్రూట్ మార్కెట్‌ను అప్పటి బీఆర్‌ఎస్ సర్కార్ బాటసింగారం గ్రామానికి తరలించింది. మార్కెట్ నిర్మాణానికి కొహెడలో 199 ఎకరాల భూమి కేటాయించి రూ.450 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణానికి అంచనాలు వేశారు. గత ప్రభుత్వం రూ.320 కోట్ల రుణం తీసుకుని ఖాతాలో జమ చేసింది. ఈ మార్కెట్‌కు ప్రతీ ఏడాది రూ.1,600 కోట్ల టర్నోవర్‌తో కొనసాగుతోంది. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న మార్కెట్‌కు నూతన పాలకమండలి నియామకం కోసం అధికారులు ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు.

ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో..

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బాటసింగారం పండ్ల మార్కెట్ చైర్మన్ నియామకానికి స్థానిక ఎమ్మెల్యేల నుంచి సిఫారసులు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మార్కెట్ పరిధిలో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, ఎల్‌బీనగర్, ఉప్పల్, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఉప్పల్, సరూర్‌నగర్, బాలాపూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలు ఉంటాయి. 18 మంది డైరెక్టర్లు ఈ పాలకవర్గంలో ఉండనున్నారు.

‘చిలుక’కే ఓకే.?

మార్కెట్ కమిటీ చైర్మన్ పేరు ఖరారయిందని.. ఐదు నియోజకవర్గాల నుంచి డైరెక్టర్ల పేర్లను సైతం తీసుకున్నట్లు సమాచారం. చైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరున్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన చిలుక మధుసూదన్‌రెడ్డి పేరు ఖరారయిందని పార్టీ వర్గాల్లో చర్చలు సాగుతున్నాయి. టీడీపీ నుంచి నేటి కాంగ్రెస్ వరకు ఆయన రేవంత్‌రెడ్డి వెన్నంటే ఉన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఆయన సోదరుడు రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి వారి సన్నిహితుడు పసుమాముల గ్రామానికి చెందిన కొత్తపల్లి జైపాల్‌రెడ్డికి ఇప్పించేందుకు మంతనాలు జరిపారనే చర్చలు కొనసాగుతున్నాయి. దర్పెల్లి రాజశేఖర్‌రెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కుమారుడు శరత్‌చంద్రారెడ్డి సైతం పోటీలో ఉన్నారు. సెకండ్ కేడర్‌కు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో సీఎం చిలుక మధుసూదన్



బాటసింగారం పండ్ల మార్కెట్ కార్యాలయం

పేరు ఫైనల్ చేశారంటూ పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. గతంలో రాగన్నగూడకు చెందిన ముత్యంరెడ్డి వైస్ చైర్మన్‌గా ఉండగా.. అప్పటి చైర్మన్ రాంనర్సింహాగౌడ్‌పై అవినీతి ఆరోపణలు వచ్చాయి. దీంతో ముత్యంరెడ్డి ఇన్‌చార్జి చైర్మన్‌గా పనిచేశారు. మధుసూదన్‌రెడ్డికి అవకాశం ఇస్తే కొహెడ పండ్ల మార్కెట్ తొలి చైర్మన్‌గా రికార్డుకెక్కనున్నారు.

కార్పొరేషన్ చైర్మన్ కోసం..

అసెంబ్లీ ఎన్నికల సమయంలో చిలుక మధుసూదన్‌రెడ్డి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి గెలుపునకు నియోజకవర్గంలో అన్నీ తానై వ్యవహరించారు. ఈ మేరకు ఆయనకు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి కట్టబెట్టేందుకు ఎమ్మెల్యే యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం మార్కెట్ కమిటీ చైర్మన్‌కు పోటీ అవసరం లేదని మధుసూదన్‌రెడ్డికే ఇవ్వాలని సూచించినట్లు హస్తం వర్గాలు వెల్లడిస్తున్నాయి. పాలకమండలి ఏర్పాటు వరకు వేచి చూస్తేనే ఎవరు చైర్మన్‌గిరి చేస్తారనేది తేలనుంది.

పాలకవర్గం ఇలా..

రాజకీయ పార్టీల నుంచి	12 మంది
ట్రేడర్స్ నుంచి	ఇద్దరు
ఎక్స్ అఫీషియో సభ్యులు	నలుగురు
మొత్తం	18 మంది

రూ.1.54 లక్షలు పలికిన లడ్డూ ప్రసాదం



లడ్డూ ప్రసాదంతో సంతోష్‌కుమార్

పెద్దేముల్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూజలందుకున్న గణనాథుడిని ఆదివారం గంగమ్మ చెంతకు చేర్చారు. తింసాన్‌పల్లి సమీపంలోని చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేశారు. పెద్దేముల్‌లోని వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి చేతిలోని లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించారు. అల్లెంకల సంతోష్‌కుమార్ వేలంలో పాల్గొని రూ.1.54 లక్షలకు ప్రసాదాన్ని దక్కించుకున్నారు. అలాగే సార మోహన్‌లాల్ ఇంటి వద్ద వినాయకుడి లడ్డూని గోపాల్‌పూర్‌కు చెందిన చారి రూ.61,100కు దక్కించుకున్నారు. రేగొండి గ్రామంలో మాజీ సర్పంచ్ హైదర్ రూ.61వేలకు లడ్డూ ప్రసాదాన్ని సొంతం చేసుకున్నారు.

విమోచనం అనడం విచారకరం

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య

కొందుర్గు: తెలంగాణ సాయుధ పోరాటంలో ఎందరో ప్రాణత్యాగాలకు పాల్పడ్డారని.. ఇలాంటి రోజు బీజేపీ ప్రభుత్వం తెలంగాణ విమోచన దినం అనడం విచారకరమని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు బుద్దుల జంగయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మండల పరిధిలోని రాంచంద్రాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17న తెలంగాణ విలీన దినంగా ప్రకటించి అధికారికంగా ఉత్సవాలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. భూమి కోసం, భుక్తికోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం, దున్నే వాడికే భూమి దక్కాలని రావి నారాయణరెడ్డి, ఎల్లారెడ్డి, మోహినుద్దీన్ నాయకత్వంలో పెద్ద ఎత్తున జరిగిన రైతంగ సాయుధ పోరాటంలో ఎర్ర జెండాలు పట్టి లక్షలాది ఎకరాల భూమిని సాగుచేశారని గుర్తు చేశారు. వారి పోరాట ఫలితంగానే పేదలకు అసైన్డ్ భూములు పంపిణీ చేశారని వివరించారు. తెలంగాణ నవాబు తొత్తులైన జాగీరుదారులు, జమీందారులు ఎందరో రైతులను పొట్టన పెట్టుకున్నారన్నారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, షేక్ బందంగి లాంటి ఎందరో మహనీయులు వెనుకడుగు వేయకుంటా ప్రాణత్యాగాలు చేశారన్నారు. తెలంగాణ వచ్చిన పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ విలీనదినోత్సవం నిర్వహించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శులు నర్సింహ, వెంకటేశ్, నాయకులు బాల్‌రాజ్, సురేశ్, యామిని, బాలకృష్ణయ్య, కృష్ణ, వెంకటయ్య, పెంటయ్య, కిష్టయ్య, రామచంద్రయ్య, జంగయ్య పాల్గొన్నారు.

గణనాథుని సేవలో ప్రముఖులు



వినాయకుడిని దర్శించుకున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు



స్వామివారి సన్నిధిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, పార్టీ నాయకులు

అనంతగిరి: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వికారాబాద్‌లోని కొత్తగంజ్‌లో ప్రతిష్ఠించిన ఆదిదేవుడిని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలను చల్లగా చూడాలని, పంటలు బాగా పండాలని వేడుకున్నట్లు తెలిపారు. మంగళవారం వికారాబాద్‌లో గణేశ్ నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్‌నాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ రత్నారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ముత్తాహార్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

శివరాంనగర్ కాలనీలో..

శివరాంనగర్ కాలనీలో ప్రతిష్ఠించిన వినాయకుడిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి దర్శించుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు డాక్టర్ రాజశేఖర్, వడ్ల నందు, బుస్స శ్రీకాంత్, నరోత్తంరెడ్డి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ముగిసిన అల్లరాయప్ప జాతర


స్వామి వారి సన్నిధిలో భక్తులు

దౌల్తాబాద్‌: మండలంలోని ఇండాపూర్‌ గ్రామంలో అల్లరాయప్ప ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. మూడు రోజులు పాటు స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకం, పల్లకీసేవ నిర్వహించారు. పూజారి తమ్మలి ప్రవీణ్‌ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి ముగింపు కార్యక్రమాలు చేశారు. జాతరకు వచ్చిన ఆడపడుచులు ఆనవాయితీ ప్రకారం గాజులు వేసుకోవడంతో గాజుల దుకాణాలు, మిఠాయి దుకాణాలు కిటకిటలాడాయి. జాతర చుట్టు పక్కల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి


గేదె కళేబరం

దోమ: విద్యుదాఘాతంతో ఓ గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని మల్లేపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. బాధిత రైతు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పులికుంట చిన్నమల్లయ్య మేత కోసమని తన గేదెలను పొలంలోకి వదిలాడు. పక్కనే ఉన్న విద్యుత్‌ వైర్లు కిందికి వేలాడడంతో గేదె వాటికి తగిలి మృత్యువాత చెందింది. పలుమార్లు విద్యుత్‌ అధికారులకు వైర్లు సరిచేయాలని కోరినా పట్టించుకోలేదని బాధిత రైతు వాపోయాడు. ఈ మేరకు మండల పశు సిబ్బంది పంచనామా చేశారు. గేదె విలువ సుమారు రూ.90 వేలు ఉంటుందని రైతు బాధపడ్డాడు.

‘ఫార్మా అంశాన్ని మరవడానికే’

దుద్యాల్‌: మండలానికి మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఐటీఐ, జూనియర్‌ కళాశాలలపై బీఆర్‌ఎస్‌ మండల యూత్‌ అధ్యక్షుడు బోగమోని సురేశ్‌ భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మండల కేంద్రం దుద్యాల్‌ అయితే మండల పరిధిలోని హకీంపేట గ్రామంలో ఏర్పాటు చేయడంలో అంతర్యం ఏంటని ప్రశ్నించారు. హకీంపేట్‌లో ఏర్పాటు వెనక పెద్ద కుట్ర ఉందన్నారు. ఫార్మాసిటీ రద్దు కోసం కొంత కాలంగా గ్రామంలోనే ధర్నాలు, రాస్తారోకోలు, రిలే నిరాహార దీక్షలు చేస్తుండడంతో వాటిని మరిచిపోవడానికే ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు.

యువజన సంఘం అధ్యక్షుడిగా శ్రీకాంత్‌



అనంతగిరి: పద్మశాలి యువజన సంఘం వికారాబాద్‌ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన బామిని శ్రీకాంత్‌ ఎన్నికయ్యారు. ఆదివారం వికారాబాద్‌లోని గౌలికార్‌ ఫంక్షన్‌ హాల్‌లో సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సంఘం రాష్ట్ర నాయకుడు నామాల అశోక్‌ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంఘాన్ని పటిష్టం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం శ్రీకాంత్‌ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం వికారాబాద్‌ అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి లక్ష్మణ్‌బాబు, కోశాధికారి వెంకటేశం, మధు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

శంకర్‌పల్లి: గుర్తు తెలియని ఓ వృద్ధుడి మృతదేహం లభ్యమైన సంఘటన ఆదివారం శంకర్‌పల్లి పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్వర్తి గ్రామ శివారులోని వరి పొలాల్లో ఓ గుర్తు తెలియని వృద్ధుడి(60–65) మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో పడి ఉంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు వెళ్లి పరిశీలించారు. ఆకలితో కానీ, నిరసంగా ఉండి ప్రమాదవశాత్తు వరి పొలంలో పడి చనిపోయినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

ప్రారంభం అట్టహాసం.. ప్రయోజనం శూన్యం

- నిరుపయోగంగా షాపింగ్‌ కాంప్లెక్స్‌
- ఉపాధి కోసం ఎదురుచూస్తున్న యువత
- పట్టించుకోని అధికార యంత్రాంగం


నిరుపయోగంగా షాపింగ్‌ కాంప్లెక్స్‌

పెద్దేముల్‌: జెడ్పీ నిధులతో నిర్మించిన మండల కేంద్రంలోని షాపింగ్‌ కాంప్లెక్స్‌ దుకాణాలు నిరుపయోగంగా మారుతున్నాయి. పేదలకు ఉపాధి కల్పన కోసమని, మండల పరిషత్‌ కార్యాలయానికి ఆర్థిక వనరులు సమకూర్చుకునేందుకు గతేడాది రూ.20 లక్షల జెడ్పీ నిధులతో షాపింగ్‌ కాంప్లెక్స్‌ను నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యంతో నేటికీ లబ్ధిదారులకు పంపిణీ కాలేదు. ప్రారంభం చేసి సుమారు ఏడాది గడుస్తున్నప్పటికీ వాటిని వినియోగంలోకి తీసుకరావడంలో అధికారులు, పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. అట్టహాసంగా ప్రారంభించిన షాపింగ్‌ కాంప్లెక్స్‌ కోసం ఎంతో మంది యువకులు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. అటు అద్దెకు ఇవ్వకుండా.. ఇటు వేలం వేయకుండా అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

పశువులకు ఆశ్రయంగా..

మండల కేంద్రంలోని మండల పరిషత్‌ కార్యాలయానికి ఆర్థిక వనరులు సమకూర్చుకునేందుకు నూతన కాంప్లెక్స్‌లో ఐదు షటర్లును నిర్మించారు. కానీ నేటికీ పంపిణీ చేయకపోవడంతో స్థానిక యువత అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పాలకులకు, సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఓ షటర్‌కు సుమారు రూ.2,000 నుంచి రూ.2,500 అద్దె వచ్చిన నెలకు రూ.12,500 ప్రభుత్వానికి ఆదాయం సమకూరేది. కానీ ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో మేకలు, పశువులకు షటర్లు ఆశ్రయంగా మారుతున్నాయి.

వినియోగంలోకి తేవాలి

ప్రస్తుతం షటర్లు లేక కొంత మంది మండల కేంద్రంలో డబ్బాలు వేసుకొని వ్యాపారుల చేసుకుంటున్నారు. దుకాణ సముదాయాల్లోని షటర్లు సమయానికి అద్దెకు ఇస్తే ఎంతో మందికి ఉపాధి దక్కేదని మండలంలోని గాజీపూర్‌, బుద్దారం, మారేపల్లి, జనగాం, తట్టెపల్లి, మంబాపూర్‌, రుద్రారంతో పాటు పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని షాపింగ్‌ కాంప్లెక్స్‌ని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు. దీనిపై ఎంపీడీఓ జర్నప్ప వివరణ కోరగా.. త్వరలో ఉన్నతాధికారులతో మాట్లాడి ఉపయోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

దుద్యాల్‌ అభివృద్ధికి చర్యలు

- పీహెచ్‌సీ, జూనియర్‌, ఐటీఐ కళాశాలలు మంజూరు
- ఆనందం వ్యక్తం చేస్తున్న మండలవాసులు



హకీంపేట్‌ గ్రామ పంచాయతీ కార్యాలయం

దుద్యాల్‌: మండలానికి ప్రభుత్వ ఆస్పత్రి(పీహెచ్‌సీ), జూనియర్‌, ఐటీఐ కళాశాలలు మంజూరయినట్లు కడా అధికారి వెంకట్‌రెడ్డి ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. దీంతో దుద్యాల్‌ మండలవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొడంగల్‌ నియోజకవర్గంలో నూతనంగా ఏర్పడిన దుద్యాల్‌ మండలం అభివృద్ధిలో పూర్తి స్థాయిలో వెనకబడింది. దీంతో మండలవాసులు పలుమార్లు ముఖ్యమంత్రిని కలిసి అభివృద్ధికి చొరవ చూపాలని విన్నవించారు. ఈ మేరకు స్పందించి ఆస్పత్రి, కళాశాలల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు కడా అధికారి వివరించారు. మండలం నుంచి పదో తరగతి పూర్తి చేసుకున్న తర్వాత ఇంటర్‌ విద్య కోసం విద్యార్థులు కోస్గి, పరిగి, కొడంగల్‌, తాండూరు పట్టణాలకు వెళ్లేవారు. ఇక్కడ చాలా మంది ఐటీఐ విద్యను అభ్యసిస్తుంటారు. అవి మహబుబ్‌నగర్‌, వికారాబాద్‌ కేంద్రాల్లో మాత్రమే ఉన్నాయి. దీంతో ఇక్కడి నుంచి వెళ్లి విద్యనభ్యసించడం చాలా ఇబ్బందిగా ఉండేది. ప్రభుత్వ ఆస్పత్రులు లేక పేద ప్రజలు వైద్యం కోసం కోస్గి, బొంరాస్‌పేట, కొడంగల్‌ మండలాలకు వెళ్లేవారు. కడా అధికారి ప్రకటనతో అన్ని సమస్యలు తొలగిపోతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వీటిని హకీంపేటలో ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

పకడ్బందీగా విధులు నిర్వహించాలి

ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌


సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్‌ఐ

పరిగి: గణేశ్‌ నిమజ్జనోత్సవంలో పోలీస్‌ సిబ్బంది విధులను పకడ్బందీగా నిర్వహించాలని ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌ సూచించారు. నిమజ్జన కార్యక్రమంలో విధులు నిర్వహించేందుకు వచ్చిన పోలీసు సిబ్బందికి ఆదివారం ఠాణా ఆవరణలో పలు సూచనలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిమజ్జన కార్యక్రమానికి అన్ని రకాల భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాన్నారు. భక్తులు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంచె లేని.. ట్రాన్స్‌ఫార్మర్‌



బంట్వారం: మండల కేంద్రం శివారులో ఏర్పాటు చేసిన విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మార్‌ ప్రమాదకరంగా మారింది. బంట్వారం–సల్బత్తాపూర్‌ మార్గంలో ట్రాన్స్‌ఫార్మార్‌ను ఏర్పాటు చేశారు. దాని చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి అల్లుకున్నాయి. దీంతోపాటు రక్షణ కంచె సైతం లేకపోవడంతో మూగజీవాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి రక్షణ కంచె ఏర్పాటు చేయలని స్థానికులు కోరుతున్నారు.

రేషన్‌ బియ్యం పట్టివేత

మోమిన్‌కలాన్‌లో 30 క్వింటాళ్లు స్వాధీనం


యంత్రాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసు, పక్కనే నిందితుడు

ధారూరు: మండల పరిధిలోని మోమిన్‌కలాన్‌లో ఆదివారం ఓ ఇంట్లో గుట్టుగా దాచిన అక్రమ రేషన్‌ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని సీజ్‌ చేశారు. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో అక్రమంగా రేషన్‌ బియ్యం దాచినట్లు టాస్క్‌ఫోర్స్‌ పోలీసులకు సమాచారం అందింది. దీంతో ధారూరు పోలీసుల సహకారంతో గ్రామానికి వెళ్లి కట్ట మాణిక్యప్రభు ఇంట్లో దాచిన 30 క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని గుర్తించారు. అక్కడ బియ్యాన్ని నూకలుగా మార్చే దందా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు పరిశీలించి యంత్రాలను సీజ్‌ చేసి, ప్రభుని అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భూ వ్యవహారంలో వ్యక్తికి రిమాండ్‌

నవాబుపేట: నమ్మించి మోసం చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన సంఘటన మాదిరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మాదిరెడ్డిపల్లి గ్రామంలో ఐదేళ్లగా నగరానికి చెందిన అంకారావు, ఒంటిపల్లి శ్రీనివాస్‌రావు అలియాస్‌ రాకేశ్‌, అంకిత్‌ రెడ్డి, రాజేందర్‌రెడ్డిలు దాదాపు 30 ఎకరాలకు పైగా భూములు కొనుగోలు చేశారు. అంకారావు మిగతా ముగ్గురితో పాటు సమాన వాటా పెట్టాడు. కానీ భూములను మాత్రం మిగతా ముగ్గురిపై రిజిస్ట్రేషన్‌ చేయించారు. కాని అంకారావుకు సమాచారం ఇవ్వకుండా మిగతా వాటాదారులు ఎకరానికి రూ.2 కోట్లకు పైగా మొత్తం 30 ఎకరాలను అమ్ముకున్నారు. విషయం తెలుసుకున్న అంకారావు వాళ్లని నిలదీశాడు. సరైన సమాదానం చెప్పకపోవడంతో ఈ నెల 6న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రధాన నిందితుడైన ఒంటిపల్లి శ్రీనివాస్‌రావుని అరెస్టు చేసి ఆదివారం తెల్లవారుజామున రిమాండ్‌కు తరలించారు. మిగతా నిందితులు రాజేందర్‌రెడ్డి, అంకిత్‌రెడ్డిలు పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌ తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


చిన్నారుల యోగాసనాలు





హుడాకాంప్లెక్స్‌: యోగాతో ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చని తెలంగాణ ఒలింపిక్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి కె.జగదీశ్వర్‌యాదవ్‌ పేర్కొన్నారు. ఆదివారం సరూర్‌నగర్‌ ఇండోర్‌ స్టేడియంలో 11వ ఇంటర్‌ డిస్ట్రిక్ట్‌ యోగాసనా స్పోర్ట్స్‌ చాంపియన్‌షిప్‌–2024, తెలంగాణ యోగా అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌యాదవ్‌ మాట్లాడుతూ.. విద్యార్థులకు చిన్ననాటి నుంచే యోగాపై మెళకువలు, అవగాహన నేర్పించాలన్నారు. ఒత్తిడి ప్రపంచంలో ప్రతి ఒక్కరికి యోగా ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఏసీపీ సారంగపాణి, స్పోర్ట్స్‌ అథారిటీ ఆఫ్‌ తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్‌ చంద్రారెడ్డి, డిస్ట్రిక్ట్‌ యూత్‌ స్పోర్ట్స్‌ అధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా ఒలింపిక్‌ అసోసియేషన్‌ కోశాధికారి రవికుమార్‌ పాల్గొన్నారు.

సోదరి ఇంటికి వెళ్తూ.. అనంతలోకాలకు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కందుకూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొత్తగూడకు చెందిన బర్లకి జంగయ్య(50)కు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కాగా శనివారం సాయంత్రం కడ్తాల్‌లో నివసించే తన సోదరి ఇంటికి యాక్టివాపై జంగయ్య బయలుదేరారు. మార్గమధ్యలో నేదునూరు గేట్‌ సమీపంలో శ్రీశైలం రహదారిపై వెనక నుంచి అతివేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఆయన్ని ఢీకొట్టింది. దీంతో యాక్టివాపై నుంచి ఆయన కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు, పోలీసుల సహాయంతో 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం ఆయన మృతి చెందారు. ఈ మేరకు ఎస్‌ఐ సైదులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సీతాఫలం.. పోషకాలు పుష్కలం

ధారూరులో విక్రయిస్తున్న మహిళలు




కోట్‌పల్లి ప్రాజెక్టు రోడ్డుపై సీతాఫలాలను విక్రయిస్తున్న మహిళలు

ధారూరు: ‘సీతాఫలం ఎంతో బలం.. దానిలో ఉంది తియ్యని గుజ్జు.. గుజ్జు గుజ్జు తినేసెయ్‌.. గింజలు తీసి పారేసెయ్‌’ అంటూ చిన్నప్పుడు మనం పాటలు పాడుకున్నాం. పోషక విలువలు సమృద్ధిగా ఉన్న సీతాఫలాన్ని చూడగానే అందరికీ నోరూరుతుంది. ఈ ఫలాలను ఆదివారం ధారూరులో కోట్‌పల్లి ప్రాజెక్టుకు వెళ్లే దారిలో స్థానిక మహిళలు విక్రయిస్తున్నారు. దీంతో అటు వైపుగా ప్రాజెక్టుకు వెళ్లే పర్యాటకులు కొనుగోలు చేస్తూ సందడి చేశారు.

ఉదయాన్నే అడవులకు వెళ్లి

మండలంలోని రాంపూర్‌తండా, గట్టెపల్లితండా, లక్ష్మీనగర్‌తండా, దోర్నాల్‌తండా, రుద్రారం, గడ్డమీది గంగారం, స్టేషన్‌ధారూరు తదితర గ్రామాల వారితో పాటు పెద్దేముల్‌ మండలంలోని మన్‌సాన్‌పల్లి, మంబాపూర్‌ గ్రామాలకు చెందిన వారు సమీప అడవుల్లోంచి సీతాఫలాలను సేకరిస్తారు. ధారూరు –తాండూరు, ధారూరు–కోట్‌పల్లి ప్రాజెక్టుకు వెళ్లే మార్గంలో రోడ్ల పక్కనే గంపల్లో పెట్టి విక్రయాలు కొనసగిస్తున్నారు. ఆయా గ్రామాలు, తండాలకు చెందిన మహిళలు అడవుల్లో సేకరించిన సీతాఫలాలను వికారాబాద్‌, తాండూరు, హైదరాబాద్‌ పట్టణాలకు తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. ఒక్కో గంప సీతాఫలాలకు రూ. 400ల నుంచి రూ. 500ల వరకు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. ముఖ్యంగా వీటిని గిరిజన మహిళలలే ఎక్కువగా సేకరిస్తున్నారు. ఉదయాన్నే సమీప అడవులకు వెళ్లి సీతాఫలాలను గోనె సంచుల్లో నింపుకొంటారు. మధ్యాహ్నం కల్లా గంపల్లో నింపి ప్రధాన రోడ్ల పక్కనే కూర్చుని అమ్మకాలు కొనసాగిస్తున్నారు.


సీజన్‌లో ఉపాధి

సెప్టెంబర్‌, అక్టోబర్‌, డిసెంబర్‌ మూడు నెలల పాటు లభించే సీతాఫలాలను అడవిలోంచి సేకరించి రోడ్డు పక్కనే విక్రయిస్తుంటామని మహిళలు తెలిపారు. రోజుకు రూ.500 నుంచి రూ.800 వరకు వస్తున్నాయన్నారు. ఎక్కువగా కాయలే విక్రయిస్తాం. అప్పుడప్పుడు పండ్లను కూడా అమ్ముతామని వివరించారు.

అధిక బరువు.. సమస్యల దరువు

జిల్లాలో పెరుగుతున్న ఊబకాయుల సంఖ్య

- మధుమేహం, గుండె జబ్బుల బారిన పడుతున్న వైనం
- జీవనశైలిలో మార్పులతో గట్టెక్కవచ్చంటున్న నిపుణులు



షాబాద్‌: అధిక బరువుతో లక్షలాది మంది ఇబ్బందులు పడుతున్నారు. శరీరానికి మించిన బరువు కారణంగా పుట్టుకొస్తున్న సమస్యలతో సతమతమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ అధిక బరువు సమస్య పెద్ద ఇబ్బందిగా పరిణమించింది. ఎన్‌ఐఎన్‌(జాతీయ పోషకాహార సంస్థ) అంచనాల ప్రకారం జిల్లాలో 45 శాతం మంది పురుషులు, 40 శాతం మందికి పైగా మహిళలు అధిక బరువు సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ 18 శాతం పైగా సమస్య పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. సమతుల ఆహారం, వ్యాయామం లాంటి వాటిపై అవగాహన లేకపోవడంతో శరీరానికి మించిన బరువు కొత్త సమస్యలకు దారితీస్తోంది.

కొంపముంచుతున్న ఆహార అలవాట్లు

ఆహార అలవాట్లలో పెను మార్పులే అధిక బరువు సమస్యకు దారితీస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ప్యాకెట్‌లలో నెలల తరబడి నిల్వ ఉంచిన ఆహారం ఊరూరా విస్తరించింది. నూనెల్లో మునిగి తేలిన ఆహారం అందుతోంది. ఈ క్రమంలో ఉప్పు, చక్కెర వాడకం ఇబ్బంది పెడుతోంది. హోటల్‌ తిండి మరింతగా బరువు పెంచుతోంది. జిల్లాలో ఏటా సగటున 9 వేలకు పైగా గుండెపోటు కేసులు నమోదవుతున్నాయి. దీనికితోడు తగిన వ్యాయామం చేయకపోవడం కొంపముంచుతోంది. జిల్లాలో 70 శాతం మంది వ్యాయామం చేయడం లేదని తెలుస్తోంది.

సమస్యలెన్నో

- శరీరానికి మించి బరువు ఉంటే చిన్న వయసులోనే మోకాళ్ల నొప్పులు వస్తాయి.
- కొవ్వులతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల కాలేయం దెబ్బతినే అవకాశం ఉంది.
- గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువ.
- మధుమేహం రావడానికి ఊబకాయం ప్రధాన కారణం.
- అనారోగ్యానికి గురైనప్పుడు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారుతుంది. ఒక్కోసారి సమస్య తీవ్రంగా ఉంటుంది.

బరువు పెరగకుండా ఉండాలంటే..

- వేపుళ్లతో కూడిన వంటకాలు తగ్గించి ఉడికించిన కూరగాయలు తినాలి.
- కార్బోహైడ్రేడ్‌లు ఎక్కువగా ఉండే కూల్‌డ్రింక్‌లు, చిప్స్‌లకు దూరంగా ఉండాలి.
- రోజూ కనీసం 40 నిమిషాలు నడక.. వారంలో 5 రోజులైనా వ్యాయామం చేయాలి.
- నూనెలు, ఉప్పు, చక్కెరలు తక్కువగా వాడితే బరువును నియంత్రించుకోవచ్చు.
- ఫైబర్‌, కాల్షియం ఎక్కువగా లభించే ఆకుకూరలు తినడం వల్ల బరువు నుంచి బయట పడవచ్చు.

ఎప్పటికైనా ప్రమాదమే



ఇటీవలి చాలామంది ఎత్తుకు తగ్గ బరువు ఉండటం లేదు. అధిక బరువుతో ఇబ్బంది పడుతున్నారు. జీవనశైలిలో వచ్చిన పెను మార్పులే దీనికి కారణం. షుగర్‌, హార్ట్‌స్ట్రోక్‌, థైరాయిడ్‌ వంటివన్నీ బరువు ఎక్కువ ఉన్నవారికి వచ్చే అవకాశం ఉంటుంది. ఆహారం, వ్యాయామంలో మార్పులు తెచ్చుకోగలిగితే సాధారణ స్థితికి రావచ్చు.

– డాక్టర్‌ విజయలక్ష్మి, పీహెచ్‌సీ, షాబాద్‌

విమోచనాన్ని అధికారికంగా జరపాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య


పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య డిమాండ్‌ చేశారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సెప్టెంబర్‌ 17ను తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. రజాకార్ల అకృత్యాలకు వ్యతిరేకంగా నాటి రైతులు, సర్దార్‌ వల్లబాయ్‌పటేల్‌ చేపట్టిన పోరాట ఫలితంగా 1948 సెప్టెంబర్‌ 17న తెలంగాణకు విమోచనం లభించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అదే రోజును ప్రజాపాలన దినోత్సవం అని ప్రకటించడం కేవలం ఎంఐఎంను సంతృప్తి పరచడం కోసమేనన్నారు. తెలంగాణ కోసం ఎంతో మంది రైతులు పోరాటం చేసి అమరులయ్యారన్నారు. ఆనాటి రజాకార్ల నాయకుడు ఖాసీం రజ్వీ వారసత్వానికి సంబంధించిన పార్టీ ఎంఐఎం అన్నారు. పటేల్‌ విగ్రహాన్ని రాష్ట్రంలో సైతం ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మూడేళ్లుగా సికింద్రాబాద్‌ పరేడ్‌ గ్రౌండ్స్‌లో విమోచన దినం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణవాదులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో నాయకులు వెంకటేష్‌గుప్తా, శేరివిష్ణువర్ధన్‌రెడ్డి, వంశీకృష్ణ, మురళీ, వెంకటేశ్‌, శ్రీనివాస్‌చారి, శ్యాంసుందర్‌, రంగన్న, రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


రమాదేవి (ఫైల్‌)

పహాడీషరీఫ్‌: వితంతు మహిళ అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కుగూడ ప్రాంతానికి చెందిన రమాదేవి(33)కి భర్త 12 ఏళ్ల క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి ఆమె శంషాబాద్‌ విమానాశ్రయంలో ప్రైవేట్‌ ఉద్యోగం చేస్తూ ఇద్దరు కుమారులు, అత్తను పోషిస్తుంది. శనివారం ఉదయం బయటికి వెళ్లొస్తానని చెప్పి వెళ్లిన ఆమె సాయంత్రం వరకు కూడా తిరిగి రాలేదు. స్థానికంగా గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆమె అత్త చెన్నమ్మ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని తెలిపారు.